
# సుందరీకరణతో బాగుపడేదెవరు?

- **రేవంత్‌కు కూల్చుడు తప్ప నిర్మించడం రాదు: హరీశ్**

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30: సీఎం రేవంత్‌రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని, మనుషులు బతుకుడు ముఖ్యమా? సుందరీకరణ ముఖ్య మా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మూసీ సుందరీకరణతో ఎవరి బతుకులు బాగు పడతాయని ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల కుటుంబాలను ప్రభుత్వం ఆగం చేస్తున్నదని, లక్షల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభు త్వం హైడ్రా పేరిట డ్రామాలు ఆపాలని అన్నారు. 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వ పెద్దలు ఒక్క కుటుంబాన్నీ పరామర్శించలేదని, ఒక్క కుటుంబాన్ని ఆదుకోలేదని తెలిపారు. చనిపోయిన ఆటో కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.


చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్

### బుల్డోజర్ రాజ్‌ను నిరోధించండి

తెలంగాణలో బుల్డోజర్ రాజ్‌ను నిరోధించేలా సీఎం రేవంత్‌రెడ్డికి సూచించాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రంలో దుర్మార్గపాలన సాగుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పౌరహక్కులను నిరంతరం ధిక్కరిస్తున్నదని పేర్కొంటూ రాహుల్‌గాంధీకి ఆయన బహిరంగ లేఖ రాశారు. మానవత్వాన్ని, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తున్నదని దుయ్యబట్టారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో సోమవారం హైకోర్టు చేసిన వ్యాఖ్యలే నిదర్శమని ఉదహరించారు.

### ఉత్తరాదిలో బీజేపీ తరహాలో పాలన

ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో పేదలు, మధ్య తరగతిపై బీజేపీ ఎలా బుల్డోజర్లను ఉపయోగించిందో తెలంగాణలో కాంగ్రెస్ కూడా అలాగే ఉపయోగిస్తున్నదని హరీశ్ ఉదహరించారు. బుల్డోజర్ విషయంలో రేవంత్‌పాలన బీజేపీ దారిలో నడుస్తున్నదని విమర్శించారు. బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీం కోర్టు తీర్పు ఉన్నా కనీస సర్వేలు కూడా చేయకుండా సరైన విధానాలను అనుసరించకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇండ్లను బుల్డోజ్ చేస్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నదని వివరించారు. 'సహజ న్యాయ సూత్రాలను, చట్టాలను గౌరవించే విధంగా ముఖ్యమంత్రికి సలహా ఇవ్వండి' అని సూచించారు. రాష్ట్రంలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

### రూల్ ఆఫ్ లాకు వ్యతిరేకంగా ప్రభుత్వ తీరు

సుప్రీంకోర్టు తీర్పును కాదని, రాష్ట్ర ప్రభుత్వం రూల్ ఆఫ్ లాకు విరుద్ధంగా వెళ్తున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు అనేది లా ఆఫ్ ది ల్యాండ్‌గా భావించాల్సి ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లు, పుట్‌పాత్, రైల్వే, నది, చెరువు అంతర్భాగాలు అక్రమించుకున్న వాటిని మినహా ఏ ఇతర నిర్మాణాలను కూల్చవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినట్టు గుర్తు చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, ప్రజాక్షేత్రంతో పాటు న్యాయస్థానాల్లో వాటిని ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు.

# కూల్చివేతలు బంద్‌పెట్టు.. హామీలపై దృష్టిపెట్టు

- **హైడ్రాకు కర్త, కర్మ, క్రియ సీఎం రేవంత్‌రెడ్డే**
- **వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే హై'డ్రామా'**
- **ఇందిరమ్మ రాజ్యమంటే పేదల ప్రాణాలు తీయడమా?**
- **శాసమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఫైర్**


సోమవారం అసెంబ్లీ హాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'పది నెలల పాలనా కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి పేద, మధ్య తరగతి ఇండ్లను కూల్చుడు.. కేసీఆర్‌ను తిట్టుడు తప్ప చేసిందేమీ లేదు. ఇకనైనా కూల్చుడు బంద్ పెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టు' అని శాసమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. హైడ్రాకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డేనని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే దీనిని తెచ్చి ప్రజలను బాధపెడుతున్నారని విమర్శించారు. మొన్న హైడ్రా, నిన్న మూసీ, ఇప్పుడు ఫోర్త్‌సిటీ పేరుతో డైవర్షన్ డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. పది నెలలుగా రాష్ట్రంలో పాలన పడకేసిందని విమర్శించారు. దవాఖానల్లో మందులు కరువయ్యాయని, గురుకులాల్లో మెస్సులు లేవని దుయ్యబట్టారు. మహాలక్ష్మి స్కీం కింద తెచ్చిన ఉచిత బస్సు పథకం తుస్సుమన్నదని విమర్శించారు. పంటకాలం పూర్తవుతున్నా రైతు భరోసా ఊసే లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తులం బంగారం, నాలుగువేల పింఛన్ మాటే ఎత్తడం లేదని నిప్పులు చెరిగారు. సోమవారం ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ, నవీన్‌రెడ్డితో కలిసి అసెంబ్లీహాల్‌లో విలేకరులతో మధుసూదనాచారి మాట్లాడారు. హైడ్రా కూల్చివేతలతో మహానగరంలో ప్రజలు హాహాకారాలు చేస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే శుభకార్యాలతో మొదలు పెట్టాలని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి కూల్చివేతలను ప్రారంభించారని విమర్శించారు. హైడ్రా కూల్చివేతలను హైకోర్టుతో పాటు ప్రతిఒక్కరూ తప్పుపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం హైడ్రాకు దారితెన్ను తెలియడంలేదని విమర్శించారని గుర్తుచేశారు. రేవంత్ వ్యవహారం ఉట్టికి ఎగరలేనమ్మ.. స్వర్గానికి ఎగిరినట్టుగా ఉన్నదని వ్యాఖ్యానించారు.

### దౌర్జన్యమే ఇందిరమ్మ పాలనా?

ఇందిరమ్మ పాలన అంటే పేదలపై దౌర్జన్యానికి దిగడమేనా? అని మధుసూదనాచారి ప్రశ్నించారు. 1976లో ఇందిరాగాంధీ ఢిల్లీలో తుర్క్‌మన్ గేటులో పేదల ఇండ్లపై బుల్డోజర్లు ఎక్కించి అడ్డొచ్చిన పది మంది పేదల ప్రాణాలు తీశారని గుర్తుచేశారు. 2008లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం భీంరావువాడ బస్తీవాసులపై ఇలాగే దౌర్జన్యకాండకు దిగిందని విమర్శించారు. ఇప్పుడు అన్ని అనుమతులు ఉన్న ఇండ్లను కూల్చివేస్తూ ప్రభుత్వమే ప్రజలకు సమస్యగా మారిందని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రజలు రేవంత్‌ను తిట్టని తిట్లు తిడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు వారు కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. 'రేవంత్‌రెడ్డి కూల్చివేతలను ఆపకుంటే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదు.. ఖబర్దార్' అని హెచ్చరించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులిచ్చి ప్రభుత్వాన్ని తిట్టిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రజల ఆవేదనను, ఆవేశాన్ని డబ్బుతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పిచ్చిపిచ్చి విమర్శలు మాని, ఇంటెలిజెన్స్ నుంచి నివేదికలు తెప్పించుకుంటే ప్రజల ఆవేదన తెలుస్తుందని సూచించారు. ఎల్ రమణ మాట్లాడుతూ హైడ్రా పేరిట ప్రభుత్వం పేదల గుండెల్లో గునపాలు దించుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా కూల్చివేతలు చేస్తుండడంతో బాధితులు భరోసా కోసం తెలంగాణ భవన్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. సీఎం తక్షణమే హైడ్రా కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు.

## హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ కొర్రీలు?

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌కు ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని సమాచారం. ఆమోదానికి వెళ్లిన ఫైలుపై గవర్నర్ పలు కొర్రీలు వేసినట్టు తెలుస్తున్నది. హైడ్రా ఏర్పాటు, పరిధి, విధివిధానాలకు సంబంధించి న్యాయపరమైన పలు అంశాలను ప్రస్తావించినట్టు సమాచారం. సెప్టెంబర్ 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో హైడ్రాకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్‌కు అధికారులు వివరించారు. అయితే, గవర్నర్ పలు అనుమానాలను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

## అక్రమ నిర్మాణాలను తొలంగించాల్సిందే: సీపీఐ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను తొలంగించాల్సిందేనని, అయితే ముందుగా పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించి నిర్మించిన విల్లాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలోని నిర్మాణాలను తక్షణమే తొలగించాలని డిమాం డ్ చేశారు. మఖ్దూంభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా బడాబాబుల జోలికి వెళ్లకుండా పేదల ఇండ్లను తొలగిస్తూ భయాభ్రాంతులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు.


MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad-500037 (TS) INDIA.
WALK-IN FOR LIBRARIAN
Qualification : Bachelor or Masters in Library Science
Date of Interview : 05th October 2024
Candidates fulfilling the eligibility criteria may step-in for walk-in interview on the date mentioned with latest Resume with photo, original documents & one set self-attested photocopies of all educational, experience certificates.
Registration Time: 09:30 A.M. - 12:00 P.M.
Sd/-
PRINCIPAL DIRECTOR





## మూసీ మార్కింగ్‌తో మాకు సంబంధం లేదు

### రంగనాథ్ ట్వీట్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైడ్రా పరిధి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు మాత్రమేనని, హైడ్రా పేదల ఇండ్ల జోలికి పోదని, నివాసం ఉండే ఇండ్లను కూల్చేయదంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఆయన ఎక్స్ వేదికగా వరుసగా ట్వీట్లు చేశారు. మూసీ నదికి ఇరువైపులా కొనసాగుతున్న సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లపై హైడ్రా మార్కింగ్ చేయలేదని స్పష్టంచేశారు. మూసీ పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని తెలిపారు. మూసీ సుందరీకరణను మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్నదని వివరించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం హైడ్రా బాధ్యత అని తెలిపారు. కాగా ఇప్పటివరకు క్లారిటీ లేకుండా ఎందుకు దూకుడుగా వ్యవహరించారని నెటిజన్లు హైడ్రా కమిషనర్‌పై మండిపడుతున్నారు.

## పేదల ఇండ్లను కూల్చితే ఊరుకోం

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 30: హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చివేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అవసరమైతే తమ ప్రాణాలను అడ్డు పెట్టి అయినా ప్రజల ఆస్తులను కాపాడతామని స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రాణాలను తీసిన తరువాతే హైడ్రా పేదల ఇండ్లపైకి వెళ్లాలని సూచించారు. జీతాలకే పైసల్లేక అల్లాడుతుంటే మూసీ ప్రక్షాళన పేరుతో అప్పు తెచ్చి దోచుకునేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని దుయ్యబట్టారు. హైడ్రా తీరు చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొరివితో తలగోక్కుంటున్నట్టు ఉన్నదని అన్నారు.


పాతబస్తీలో హైడ్రాకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

# పాతబస్తీలోకి వచ్చే దమ్ముందా?

## ముఖ్యమంత్రి రేవంత్, హైడ్రా అధికారులకు ఎంఐఎం సవాల్

- **కూల్చడానికి ముందు మాపై నుంచి వెళ్లాలి**
- **హైడ్రా హటావో.. ఘర్ బచావో.. నినాదాలు**
- **పాతబస్తీలో అట్టుడికిన ఆందోళనలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 ( నమస్తే తెలంగాణ ): 'హైడ్రా హటావో.. ఘర్ బచావో' నినాదం పాత బస్తీలో మార్మోగింది. సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రాకు వ్యతిరేకంగా ఎంఐఎం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు బహదూర్‌పుర, కిషన్‌బాగ్‌లో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా బహదూర్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ.. పాత బస్తీలోకి బుల్డోజర్లు వచ్చే దమ్ముందా.. వస్తే తామేంటో చూపిస్తామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొండిగా ఇండ్లను కూల్చడానికి యత్నిస్తే.. బుల్డోజర్ల ముందు తాము నిలబడతామని సవాల్ విసిరారు. ఎవరూ భయపడాల్సిన అవసరంలేదని చెప్పారు. ఎలాంటి నష్టపరిహారం, ప్రత్యామ్నాయ నివాసం ఏర్పాటు చేయకుండా రేవంత్ సర్కార్ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. 'హైదరాబాద్ కలెక్టర్‌తో చర్చించామని.. 2003లో మూసీ నది ఫిజికల్ సర్వే ప్రకారం స్వాధీనం చేసుకోవాలని సూచించినట్టు పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు మద్దతుగా ఆందోళన చేసిన కార్పొరేటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఎంఐఎం నాయకులు వెళ్లాక విడుదల చేశారు.

### హైడ్రాకు ఎంఐఎం సవాల్

హైడ్రా ఏర్పాటు నుంచి ఎంఐఎం పార్టీ వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నది. పాతబస్తీలోని ఫాతిమా కాలేజీ కూల్చివేయాలని ప్రచారం జరగడంతో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ఘాటుగా స్పందించారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి.. కత్తులతో దాడి చేయండి. కాలేజీలను మాత్రం కూల్చేయకండి' అంటూ అక్బరుద్దీన్ చేసిన కామెంట్స్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. విద్యాసంవత్సరం మధ్యలో విద్యార్థులకు నష్టం చేయమని హైడ్రా వెనక్కి తగ్గి, పేదల ఇండ్లను కూల్చుతుండడంపై విమర్శలు వస్తున్నాయి.

- **హైడ్రాపై ఎర్రబావుటా**


హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద మూసీ బాధితులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేతలు

- **హైడ్రాపై వినూత్న నిరసన**


ఆక్రమణల పేరిట పేదల ఇండ్లే టార్గెట్‌గా కూల్చివేతలకు పాల్పడుతూ, పెద్దల జోలికి వెళ్లని హైడ్రాపై కాంగ్రెస్ మాజీ నాయకుడు బక్క జడ్సన్ వినూత్న రీతిలో నిరసనకు దిగారు. హైడ్రా తరహాలోనే పలు ప్రభుత్వ భవనాలపై మార్కింగ్ చేశారు.